నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 27 డిసెంబర్ 2024 | KAMAREDDY

# డెత్ మిస్టరీ

- కలకలం రేపిన ముగ్గురి మృతి
- ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరొకరి దుర్మరణం
- అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో మూడు మృతదేహాలు లభ్యం
- అంతులేని ప్రశ్నలెన్నో రేకెత్తిస్తున్న ఉదంతం
- మృతదేహాలపై బలమైన గాయాలు
- వివరాలు వెల్లడించని పోలీసులు
- పోస్టుమార్టం నివేదిక వస్తేనే వాస్తవాలు వెలుగులోకి..

**అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో** ముగ్గురు మృతి చెందడం ఉమ్మడి జిల్లాలో కలకలం రేపింది. అందులో ఎస్సై, మహిళా కానిస్టేబుల్ ఉండడం పోలీసు వర్గాలను కలవరపాటుకు గురి చేసింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ (33), బీబీపేటలో పని చేసే మహిళా కానిస్టేబుల్ కమ్మరి శ్రుతి (32), కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ (29) మృతదేహాలు పెద్దచెరువులో లభ్యమయ్యాయి. పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించక పోవడంతో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ ఉదంతంలో వివాహేతర సంబంధమే ప్రధాన కారణమని భావిస్తున్నప్పటికీ, ముగ్గురూ ఒకేసారి చనిపోవడంపై సందేహాలెన్నో వెల్లువెత్తుతున్నాయి. పెండ్లి చేసుకునే అంశంపై ముగ్గురి మధ్య వచ్చిన అభ్యంతరాలే ఇందుకు కారణమనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కోపోద్రిక్తులై ఒకరు చెరువులో దూకగా కాపాడే క్రమంలో ముగ్గురు మృతి చెందారా? లేక ఇద్దరిని చంపి మరొకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారా? అన్న దానిపై సందేహాలు నెలకొన్నాయి.

నిజామాబాద్, డిసెంబర్ 26
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)


కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన పోస్టుమార్టం గది వద్ద గుమిగూడిన మృతుల కుటుంబీకులు, బంధువులు


ఎస్సై సాయికుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న అతడి బాబాయ్ లక్ష్మణ్

## ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం..

మెదక్ జిల్లాకు చెందిన సాయికుమార్‌ది పేద కుటుంబం. కష్టపడి పైకి వచ్చిన ఆయన ఎస్సైగా స్థిరపడ్డాడు. ఆయన భార్య గర్భవతి కాగా.. మూడేండ్ల కుమారుడు ఉన్నాడు. కిందిస్థాయి నుంచి ఎదిగిన అతడు ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు కాదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మరోవైపు, గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన శ్రుతిది కూడా సాధారణ స్థాయి కుటుంబమే. 2014లో కానిస్టేబుల్‌గా ఎంపికైన ఆమె గాంధారిలో ఆరేండ్లు, కామారెడ్డిలో సంవత్సరం పాటు పని చేసింది. గతంలోనే వివాహమై విడాకులు కూడా తీసుకున్న శ్రుతి మూడేండ్లుగా బీబీపేటలో విధులు నిర్వహిస్తూ తల్లిదండ్రులు యోగక్షేమాలు చూసుకుంటున్నది. సాయికుమార్ బీబీపేట ఎస్సైగా ఉన్న సమయంలోనే ఆమెతో పరిచయం ఏర్పడింది. అతడు బదిలీపై భిక్కనూరుకు వెళ్లగా, బీబీపేటకు చెందిన నిఖిల్‌తో శ్రుతికి సాన్నిహిత్యం పెరిగిందని తెలిసింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన నిఖిల్ ఈమధ్యే బీబీపేట సొసైటీలో తాత్కాలిక ఉద్యోగిగా చేరాడు. వయస్సులో శ్రుతి కంటే చిన్నవాడైన అతడు ఆమెతో పెండ్లికి సిద్ధపడినట్లు తెలిసింది. బీబీపేట కేంద్రంగా మొదలైన పరిచయాల పర్వం.. ముగ్గురి ప్రాణాల మీదకు తెచ్చింది.

## మిన్నంటిన రోదనలు..

విధి నిర్వహణలో భాగంగా గురువారం మధ్యాహ్నం కాచాపూర్‌కు వచ్చిన ఎస్సై సాయికుమార్ ఆ తర్వాత అదృశ్యమయ్యారు. అదే సమయంలో బీబీపేట పోలీసుస్టేషన్‌లో విధులు ముగించుకుని ఇంటికి బయల్దేరిన కానిస్టేబుల్ శ్రుతి కూడా కనిపించకుండా పోయింది. దీనిపై సమాచారమందుకున్న పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా.. ఇద్దరు సదాశివనగర్ మండలం అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్దచెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు అక్కడకు వెళ్లి చూడగా ఎస్సై సొంత కారు, చెప్పులు, ఫోన్లు లభ్యమయ్యాయి. దీంతో గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించగా, బుధవారం అర్ధరాత్రి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గురువారం ఉదయం సాయికుమార్ మృతదేహం లభించింది. మూడు మృతదేహాలను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పోస్టుమార్టం గది వద్ద పెను విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మధ్యాహ్నం తర్వాత పోస్టుమార్టం పూర్తి కావడంతో మృతదేహాలను వేర్వేరు అంబులెన్సుల్లో స్వగ్రామలకు తరలించారు. కుటుంబ సభ్యుల కన్నీటి రోదనల మధ్య గాంధారిలో శ్రుతి, బీబీపేటలో నిఖిల్ అంత్యక్రియలు పూర్తయ్యాయి.


కానిస్టేబుల్ శ్రుతి (ఫైల్)


నిఖిల్ (ఫైల్)


ఎస్సై సాయికుమార్ (ఫైల్)


రోదిస్తున్న నిఖిల్ కుటుంబీకులు

## స్పష్టత ఇవ్వని పోలీసులు..

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ ఉదంతంపై పోలీసు అధికారులు ఏమీ చెప్పడం లేదు. దీంతో ఎవరికి తోచింది వారు ఊహించుకుంటున్నారు. ప్రస్తుతానికి విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక వివరాలు చెబుతామని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. భిక్కనూర్ ఎస్సై సాయికుమార్, మహిళా కానిస్టేబుల్ శ్రుతి, ఆపరేటర్ నిఖిల్ మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా పెద్ద చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించి గాలించగా, మూడు మృతదేహాలు లభ్యమయ్యాయన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చే వరకు ముగ్గురి మృతికి గల కారణాలు ఏమిటని చెప్పలేమన్నారు. పూర్తి విచారణ అనంతరం ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడిస్తామని తెలిపారు.

## శ్రుతికి కన్నీటి వీడ్కోలు

- ఆమె మృతిపై తల్లిదండ్రుల అనుమానాలు
- పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులకు వినతి
- బీబీపేట్‌లో ముగిసిన నిఖిల్ అంత్యక్రియలు

గాంధారి/బీబీపేట్, డిసెంబర్ 26: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి సమీపంలోని చెరువులో భిక్కనూర్ ఎస్సై సాయికుమార్‌తోపాటు బీబీ పేట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రుతి (33), మరో యువకుడు నిఖిల్ మృతిచెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం శ్రుతి మృతదేహాన్ని స్వగ్రామం గాంధారికి, నిఖిల్ మృతదేహం బీబీపేటకు తరలించగా.. కుటుంబ సభ్యులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, ఎల్లారెడ్డి సీఐ రవీంద్రనాథ్, గాంధారి ఎస్సై అంజనేయులు శ్రుతి పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. అంతిమయాత్రలో తోటి ఉద్యోగులతోపాటు స్నేహితులు పాల్గొన్నారు.

### కుటుంబానికి పెద్దదిక్కుగా శ్రుతి

మండలంలోని గుర్జాల్ గ్రామానికి చెందిన కమ్మరి పుండరీకం, విజయ దంపతులకు ఇద్దరు కూతుళ్లు (శ్రుతి, శ్వేత), ఒక కొడుకు (నవీన్) ఉన్నారు. 20 ఏండ్లుగా గాంధారి మండల కేంద్రంలోని నరేంద్రనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. తండ్రి పుండరీకం కుల వృత్తి చేస్తుండగా, తల్లి బీడీలు చుడుతూ పిల్లలను చదివించారు. పుండరీకం పెద్ద కూతురు శ్రుతి 2014లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఆరేండ్లపాటు పనిచేసింది. బదిలీపై కామారెడ్డిలో ఏడాది, మూడేండ్లుగా బీబీపేట్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న శ్రుతి మృతిచెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఆమెది ఆత్మహత్య కాదని, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

### కేసు నమోదు

రామారెడ్డి, డిసెంబర్ 26: భిక్కనూర్ ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, ఆపరేటర్ నిఖిల్ మృతిపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపారు.


దవాఖాన వద్ద రోదిస్తున్న ఎస్సై సాయికుమార్ కుటుంబీకులు

### పోలీసులు గుర్తించలేదా?

శ్రుతి కొంతకాలంగా స్తబ్ధుగా ఉంటున్నట్లు తెలిసిన వారు చెబుతున్నారు. నిఖిల్‌తో పరిచయం ఏర్పడిన విషయం తోటి ఉద్యోగులతో పాటు చాలా మందికి తెలిసింది. ఈ విషయాన్ని బీబీపేట పోలీసులు గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి ఉంటే ప్రాణాలు పోయే వరకు వచ్చి ఉండేది కాదన్న వాదన బలంగా వినిపిస్తున్నది. మరోవైపు సామాన్యప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలపై నిఘా పెట్టే పోలీసులు సొంత శాఖలోని సిబ్బంది వ్యవహారాలపై దృష్టి సారించక పోవడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులే అనుకోని బలహీన క్షణాల్లో ఇతరత్రా కారణాలతో ప్రాణాలు తీసుకుంటుండం విస్మయాని గురి చేస్తున్నది.

### సంచలనాలకు కేరాఫ్ సదాశివనగర్..

సదాశివనగర్ సంచలనాలకు కేంద్రంగా నిలిచింది. గతంలో ఇదే ఠాణా పరిధిలో 2023 డిసెంబర్ 18న జంట హత్యల కేసు వెలుగు చూసింది. నాలుగైదు రోజులకు నిందితులను పట్టుకుని విచారిస్తున్న క్రమంలో వరుస హత్యలు వెలుగులోకి వచ్చాయి. భూంపల్లి గ్రామ పరిధిలో ఓ యువతిని దహనం చేసిన ఘటనపై కూపీ లాగగా ఆరుగురు అమాయకుల హత్యోదంతం బయటపడింది. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన ఈ ఘటన డిసెంబర్ నెలలోనే చోటు చేసుకోగా, తాజాగా ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, నిఖిల్ మరణాలు డిసెంబర్‌లోనే చోటు చేసుకోవడం గమనార్హం.

### ఎస్సై సాయి చాలా మంచోడు...

మా సాయి చాలా మంచోడు. నా చేతుల మీదుగానే పెరిగాడు. కష్టపడి సాయి పైకి వచ్చాడు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నిరంతరం తపించే వ్యక్తి. చెరువులో ఇద్దరు మునిగిపోతుంటే వారిని కాపాడే క్రమంలోనే సాయి కూడా ప్రాణాలు పోగొట్టుకున్నట్లు భావిస్తున్నాము. సాయికి మూడేండ్ల కుమారుడు, భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. దయచేసి అసత్య ప్రచారాలు చేయొద్దని కోరుతున్నా.

**- లక్ష్మణ్, భిక్కనూర్ ఎస్సై బాబాయి**

### సందేహాలెన్నో..

బుధవారం మధ్యాహ్నం తర్వాత అదృశ్యమైన సాయికుమార్, శ్రుతి, నిఖిల్ ఒక్కచోటికి చేరారు. భిక్కనూరు, బీబీపేటలో ఉండే ముగ్గురూ తమ పరిధిలో కాకుండా సదాశివనగర్ మండలంలోని పెద్ద చెరువు వద్ద భేటీ అయ్యారు. ఎస్సై సొంత కారులోనే ముగ్గురు వచ్చినట్లు చెబుతున్నారు. అయితే, ముందుగా ఈ ముగ్గురు ఎక్కడ కలిశారు? ఎందుకోసం పెద్ద చెరువు వద్దకు వచ్చారన్నది అంతుచిక్కడం లేదు. మృతురాలు శ్రుతి ద్విచక్రవాహనం ప్రస్తుతం భిక్కనూర్ ఠాణాలో ఉండడం గమనార్హం. మరోవైపు, ముగ్గురి మృతి వెనుక ఉన్న కారణాలు ఏమిటనేది సస్పెన్స్‌గా మారింది. ముగ్గురు కలిసి ఆత్మహత్య చేసుకున్నారా? లేక ఒకరు ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులో దూకితే కాపాడే క్రమంలో మిగతా ఇద్దరు చనిపోయారా? అన్న సందేహాలు నెలకొన్నాయి. లేదా పెండ్లి విషయంలో తలెత్తిన అభిప్రాయ భేదాలతో ఇద్దరిని చంపి మరొకరు ఆత్మహత్య చేసుకున్నారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మృతదేహాలపై రక్తపు మరకలు, గాయాలు ఉండడం ఈ సందేహాలకు బలం చేకూర్చుతున్నది. ప్రస్తుతం జరుగుతున్న అనేక ప్రచారాలకు పోస్టుమార్టం రిపోర్టుతోనే తెరపడనున్నది. మరోవైపు, చెరువు వద్ద లభ్యమైన మృతుల ఫోన్లను పరిశీలిస్తే మరణాలకు సంబంధించిన కీలకమైన సమాచారం లభ్యమయ్యే అవకాశమున్నది.


రోదిస్తున్న శ్రుతి కుటుంబీకులు

## విచారణ కొనసాగుతున్నది..

- ముగ్గురి మృతిపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేం..
- పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే వాస్తవాలు బయటపడే అవకాశాలు
- మీడియాతో కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, డిసెంబర్ 26 : భిక్కనూర్ ఎస్సై సాయికుమార్‌తోపాటు బీబీ పేట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రుతి (33), మరో యువకుడు నిఖిల్ మృతి కేసులో విచారణ కొనసాగుతున్నదని కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ తెలిపారు. ఈ ముగ్గురు బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడగా.. వీరి ఫోన్ల సిగ్నల్స్ ఆధారంగా అడ్లూర్ పెద్ద చెరువు వద్ద ఉన్నట్లు తెలుసుకొని ఎస్పీ సింధూశర్మ అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఎస్సై సాయికుమార్ సొంతకారు ఉండడంతో అనుమానం వచ్చి చెరువులో గాలించగా బీబీపేట్ పీఎస్ కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట్‌కు చెందిన ఆపరేటర్ నిఖిల్ మృతదేహాలు అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత లభించాయి. అనంతరం ఎస్సై సాయికుమార్ మృత దేహం కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా.. గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో లభించింది. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. సాయికుమార్, శ్రుతి, నిఖిల్ మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా అడ్లూర్ పెద్ద చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సాయికుమార్ జేబులో సెల్‌ఫోన్‌తోపాటు అతడికి చెందిన కారు, చెప్పులు, ఆపరేటర్ నిఖిల్ చెప్పులు సైతం అదే ప్రాంతంలో లభ్యమైనట్లు చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జనరల్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదికతోపాటు పూర్తి విచారణ అనంతరం ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడిస్తామని చెప్పారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ

మృతుల కుటుంబాలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పరామర్శించారు. ప్రభుత్వంతో మాట్లాడి ఎస్సై భార్యతో పాటు శ్రుతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. పోలీసుల విచారణ అనంతరం నిఖిల్ కుటుంబానికి న్యాయం చేస్తామని వెల్లడించారు. దవాఖాన వద్ద పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ


కామారెడ్డి పట్టణంలో రోడ్డు ఊడుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## రోడ్లు ఊడ్చి నిరసన

**కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె**

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 26 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 17వ రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా వారు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో గురువారం రోడ్లను ఊడ్చి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం నిరసనలు, నిరవధిక సమ్మె చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. తమను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని కోరారు.

## డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా చెరువులు నింపండి

- లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, డిసెంబర్ 26: కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నందున డిస్ట్రిబ్యూటరీ (డీ-18, డీ-19, డీ-20) కాలువల ద్వారా ఏర్గట్ల మండలంలోని చెరువులు నింపాలని సీఈ సుధాకర్‌రెడ్డిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన వివిధ శుభకార్యాల్లో పాల్గొనేందుకు ఏర్గట్లకు వచ్చిన ఎమ్మెల్యేను ఏర్గట్ల మండల రైతులు కలుసుకున్నారు. మండలంలోని చెరువులు నింపించాలని కోరగా.. ఎమ్మెల్యే సీఈతో ఫోన్‌లో మాట్లాడారు. మూడు డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా ఏర్గట్ల మండలంలోని ఎన్ని చెరువులు నింపగలిగితే అన్ని చెరువులను నింపాలని సూచించారు. బాల్కొండ నియోజకవర్గంలోని గ్రామాలకు నీళ్లివ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఇక్కడి రైతులు ఆందోళనకు దిగే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. చెరువులు నింపకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.


సీఈ సుధాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

## వీధి దీపాలకు కూడా మున్సిపల్‌లో డబ్బులు లేవా?

- ఆలూర్ బైపాస్ రోడ్డుపై నిర్లక్ష్యం తగదు
- నందిపేట్ డబుల్ రోడ్డు పొడవునా మొక్కలు నాటాలి
- మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


నందిపేట్‌లో ప్రధానరోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 26: ఆలూర్ బైపాస్ రోడ్డుపై నిర్లక్ష్యం తగదని, అక్కడ వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి ఆర్మూర్ మున్సిపల్‌లో డబ్బులు కూడా లేవా అని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన ఆలూర్ బైపాస్ రోడ్డుతోపాటు అక్కడ నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వాకర్లు, స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిబద్ధతలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం తగదన్నారు. ఆలూర్ బైపాస్ రోడ్డు నిర్మాణం స్థానిక ప్రజల ఏండ్ల కల అని గుర్తుచేశారు. ఇరుకైన రోడ్లు, వాహనాల రద్దీ, దుమ్ముధూళితో ఆరోగ్య సమస్యలు, పక్కనే ఉన్న చెరువు నిండితే వచ్చే వరదలతో ఆర్మూర్ పట్టణంలోని వేల కుటుంబాలు నిరాశ్రయులుగా మారేవని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆలూర్ బైపాస్ రోడ్డు కోసం ఆందోళనలు చేసినట్లు తెలిపారు. స్వరాష్ట్రం సిద్ధించాక తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సహకారంతో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తిచేసినట్లు చెప్పారు. స్థానిక ప్రజలకు ప్రాణ సంకటంగా మారిన లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో 50 గ్రామాలకు కనెక్టివిటి కలిగిందన్నారు. ఆలూర్ బైపాస్ రోడ్డులో విద్యుద్దీపాలు లేక స్థానికులతోపాటు వాకర్లు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్, కమిషన్ స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### నందిపేట్ డబుల్ రోడ్డు పొడవునా మొక్కలు నాటాలి

నందిపేట్ డబుల్ రోడ్డును రూ.13 కోట్లతో నిర్మించామని, రోడ్డు పొడవునా మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. నందిపేట్ డబుల్ రోడ్డును జీవన్‌రెడ్డి పరిశీలించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.